క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న కారు


ధ్వంసమైన కారు

నాగలాపురం: పుత్తూరు– చెన్నై హైవేపై చిన్నాపట్టు గ్రామం వద్ద శుక్రవారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. వివరాలు.. తమిళనాడులోని మీంజూరుకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుమలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. కారు పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు కార్యదర్శుల సామూహిక సెలవు


ఇన్‌చార్జి ఎంపీడీఓకు సెలవు పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సత్యవేడు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం సామూహికంగా సెలవు పెట్టారు. పంచాయతీ కార్యదర్శులపై సీపీఆర్ చేసిన వ్యాఖ్యలలకు నిరసనగా విధులకు గైర్హాజరు కావాలని నిర్ణయించారు. శుక్రవారం ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ త్రివిక్రమరావుకు సెలవు పత్రాలు అందజేశారు. సెక్రటరీలు శైలేంద్ర కుమార్, మునిరవికుమార్, హరీష్, కుముద, హరిత, జ్ఞానప్రకాష్, పద్మనాభరాజు, ఉషారాణి, సుజాత పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేణిగుంట: అనధికారకంగా పోలీస్, ప్రెస్ స్టిక్కర్లు ఉపయోగిస్తున్న వారికి రేణిగుంట, గాజుల మండ్యం పోలీసులు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం కూడలిలో అర్బన్ సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, పోలీస్, ప్రెస్ స్టిక్కర్ల దుర్వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కేఎల్ఎమ్ హాస్పిటల్ కూడలిలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఆదేశాలు మేరకు ఎస్ఐ సుధాకర్ తనిఖీలు చేసి, అవగాహన కల్పించారు. గుర్తింపు కార్డులు లేకుండా స్టిక్కర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని పోలీసులు తెలిపారు.

రాయంచపై పరాశరేశ్వరుని విహారం


హంస వాహనంపై స్వామివారు

నారాయణవనం: టీటీడీ అనుబంధంగా వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి హంస వాహనంపై స్వామివారు విహరించారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం వైభవంగా హంసవాహన సేవ జరిపించారు. ఏఈఓవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం సరికాదు

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయాలనే నిర్ణయం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద బిడ్డలకు విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ నాటి ప్రభుత్వం తెచ్చిన జీవో 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని విస్మరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా తిరుపతి జిల్లాలోనే 583 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలిపారు. వేణుగోపాల్ కాలనీలో 70 ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేసి నెల గడిచిన కనీసం ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం నేతలు కందారపు మురళి, సాయిలక్ష్మి, అంగురి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, మాధవ్, వేణుగోపాల్, ప్రాంతీయ కార్యదర్శులు రమేష్,మణి పాల్గొన్నారు.

పాత సీసాలో కొత్త రోగం!

ప్లాస్టిక్ వాడకంతో వాతావరణ కాలుష్యం పెరుగుతోందని నిపుణులు వెల్లడిస్తున్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ జనం మాత్రం ఈ సూచనలను పెడచెవిన పెడుతున్నారు. యథేచ్ఛగా ప్లాస్టిక్ వస్తువలు వినియోగిస్తూనే ఉన్నారు. అందులో భాగంగా పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైతం ఎక్కువగా ప్లాస్టిక్ సీసాల్లోనే నీటిని తీసుకెళుతున్నారు. దీంతో పలు రోగాలు సోకే ప్రమాదముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.


ప్లాస్టిక్ బాటిళ్లలో నీళ్లు నింపుకుని వచ్చి భోజనాలు చేస్తున్న చిన్న పాండూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


వాడేసిన శీతల పానీయాల బాటిళ్లలో నీటిని తెచ్చుకుని తాగుతున్న తాగేలి ప్రాథమిక పాఠశాల చిన్నారులు

- నెలల తరబడి ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించడం ప్రమాదకరం
- అధిక సంఖ్యలో వాడుతున్న విద్యార్థులు
- అవగాహన కల్పించడం అవసరం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తం

వరదయ్యపాళెం: ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం, ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించకూడదని నిత్యం చెబుతూనే ఉన్నాం. అయితే ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదు. రోజురోజుకూ ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. ప్రధానంగా కూల్‌డ్రింక్స్, నీళ్ల బాటిళ్ల వంటివి దుకాణాల్లో తాగిన వెంటనే పడేయాలి. అయితే వాటిని నెలల తరబడి వినియోగిస్తున్నారు. కా, కొందరు వాటిని తాగునీటికి వినియోగించుకుంటున్నారు. తద్వారా కొత్త రోగాలు వస్తున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అవగాహన లోపం కారణంగా తాగి ఖాళీ చేసిన వాటిలో తాగునీటిని నింపుకుని పాఠశాలకు వెళుతున్నారు. భోజన సమయంలో వాటిని తాగుతున్నారు. దీని కారణంగా పలు ఆరోగ్య సమస్యలు వచ్చి పడుతున్నాయని వైద్యులు వెల్లడిస్తున్నారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఇవన్నీ తెలిసినా విద్యార్థులకు వివరించి చెప్పలేని స్థితిలో ఉండడం గమనార్హం.

విషపూరిత రసాయనాలతో..

విషపూరిత రసాయనాలను వినియోగించి తయారుచేసిన ప్లాస్టిక్ బాటిళ్లను వాడితే మహిళలు, పురుషుల్లో సంతానోత్పత్తి సమస్య తలెత్తుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాటిళ్లు శుభ్రంగా లేకపోవడంతో నీరు కలుషితమై వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు, ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వెల్లడిస్తున్నారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లను కడిగి ఎండలో పెట్టడం వల్ల ఆ సీసా తయారీ సందర్భంగా ఉపయోగించిన చిన్న రసాయనాలు వేడికి కరిగి అందులో నీరు పట్టినప్పుడు కలుషితమవుతున్నాయని వివరిస్తున్నారు.

ఎక్కడ చూసినా అదే పరిస్థితి

సత్యవేడు నియోజకవర్గంలోని ఏ పాఠశాలలో చూసినా ఇదే పరిస్థితి దర్శనమిస్తోంది. పాఠశాలల్లో అధికశాతం విద్యార్థులు తాగిప డేసిన ప్లాస్టిక్ బాటిళ్లనే వినియోగిస్తున్నారు. కొన్ని సీసాలను నెలల తరబడి వాడడంతో అవి అపరిశుభ్రంగా మారుతున్నాయి. విద్యార్థులు వాడుతున్న బాటిళ్లను బట్టి ఎప్పటి నుంచి వినియోగిస్తున్నారో తెలుస్తోంది. పరిశీలించిన పాఠశాలలో 750 మంది విద్యార్థులు ఉండగా అందులో 70శాతం మంది విద్యార్థులు వాడి పడేసిన బాటిళ్లనే వాడుతుండడం గమనార్హం. పాఠశాలలో నీటి వసతి ఉన్నప్పటికీ ప్రతిసారీ అక్కడకు వెళ్లలేక తాము బాటిళ్లు వాడుతున్నట్లు విద్యార్థులు వెల్లడిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో తాగునీటి వసతి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వాడుతున్నారు.

బాధ్యత ఉపాధ్యాయులదే

ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దష్టి పెట్టాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ప్రధానంగా వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను నెలల తరబడి వినియోగిస్తే అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్న విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేస్తోంది.

వాడకపోవడమే మంచిది



ప్లాస్టిక్ బాటిళ్లను వాడకపోవడమే ఆరోగ్యానికి మంచిది. వీటి తయారీకి రకరకాల రసాయనాలను వినియోగిస్తారు. నెలల తరబడి వాడడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. మొదట జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని గుర్తించాలి.

– ద్వైత, వైద్యాధికారి, పీహెచ్‌సీ, వరదయ్యపాళెం

శ్వాస సంబంధిత వ్యాధులు



కూల్‌డ్రింక్స్,నీటి బాటిళ్లు వాడి పడేసిన తర్వాత వినియోగిస్తే శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. తాగునీటికి మార్కెట్‌లో కొన్ని బాటిళ్లను విక్రయిస్తున్నారు. వాటిని వినియోగిస్తే సమస్యలు ఉండవు. విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

–ప్రశాంత్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చిన్న పాండూరు

బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో చదువుతున్న పిల్లలకు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, తులసీనాథ్ హాస్టల్‌కు చేరుకుని, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతపై సూచనలిచ్చారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాచి, చల్లార్చిన నీళ్లను తాగాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి పల్లా వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం రీటా పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి


రేణిగుంట పాత చెక్‌పోస్ట్ కూడలి

రేణిగుంట: రేణిగుంట పాత చెక్‌పోస్ట్‌లోని పుత్తూరు–రేణిగుంట రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పాత చెక్‌పోస్ట్‌లో మూడు రోడ్లు కలిసే చోట నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే పక్కనే మూడు పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు రోడ్డు దాటుకునే క్రమంలో వాహనాలు అధిక వేగంతో రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ జోన్ ప్రాంతం, సర్కిల్ కావడంతో స్పీడ్ బ్రేకర్లు వేస్తే ప్రమాదాలు నివారించవచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం తారు రోడ్డు వేస్తున్న తరుణంలో స్పీడ్ బ్రేకర్లు కూడా వేయించాలని కోరుతున్నారు. అధికారులు చొరవ చూపి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పల్లెల్లో క్యాన్సర్ స్క్రీనింగ్


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, నీర్పాకోటలో శుక్రవారం పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు పెద్దసంఖ్యలో జనం హాజరయ్యారు. వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన గాజులపెళ్లూరు, పుత్తేరిలో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఉదయ్‌కుమార్, హరిత, చైతన్యభాను, సీహెచ్‌ఓ వెంకటేశులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం


తహసీల్దార్‌ను సత్కరిస్తున్న అంబేడ్కర్ బహుజన సంఘం నేతలు

రేణిగుంట: మండల తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డిని శుక్రవారం అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ రెవెన్యూ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా స్టార్ కష్ణ మాట్లాడుతూ మండలంలోని పేద బడుగు బలహీన వర్గాల ప్రజల రెవెన్యూ సమస్యలు చిత్తశుద్ధితో పరిశీలించి, పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ తన దృష్టికి వచ్చిన న్యాయపరమైన సమస్యలన్నింటినీ తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే డీటీ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గాలి రవి, ఈశ్వర్, నల్లన్న, సుబ్బరామయ్య, రాజా, గురుమూర్తి, చంగల్రాయలు, విష్ణు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో ఎయిర్ ఇండియా సీఎస్ఓ


గుడిమల్లం ఆలయంలో వికాస్ కుమార్ సిన్హా

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న ఆనందవల్లీ దేవి సమేత పరశురామేశ్వర స్వామిని శుక్రవారం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ న్యూఢిల్లీ సీఎస్ఓ(చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) వికాస్‌కుమార్ సిన్హా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి సాదర స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనాలను పలికి, శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ముగ్గురే విద్యార్థులు


పిల్లలతో ప్రార్థన చేయిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం ఎస్టీ కాలనీలోని ఫౌండేషన్ పాఠశాలకు శుక్రవారం ముగ్గురు విద్యార్థులే హాజరయ్యారు. స్కూల్ తనిఖీకి వెళ్లిన ఎంఈఓ మునిసుబ్రమణ్యం వారితో ప్రార్థన చేయించారు. ఆ పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు సంబంధించి ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉండడం గమనార్హం.

వారాహి అమ్మవారికి విశేష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో వెలసిన ప్రదోష క్షేత్రం సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో వారాహి ఆషాఢ నవరాత్రుల్లో బాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అభిషేకాలు జరిపించారు. అభిషేకాలకు ఉభయకర్తలుగా శ్రీ శ్రీనివాస మిల్క్ డైయిరీ నిర్వాహకులు వ్యవహరించారు. ఈఓ లత పాల్గొన్నారు.

వైభవంగా వారపు ఉత్సవం

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం బంగారు తిరుచ్చిపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీకష్ణ ముఖమండపం వద్ద కనులపండువగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం అలంకార మండపంలో వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. సాయంత్రం శ్రీవారి దేవేరి బంగా రు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు.

హిందీ భాష పరీక్షల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన గురుకుల పాఠశాల విద్యార్థులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ప్రచార సభ నిర్వహించిన హిందీ భాష పరీక్షల్లో పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పరీక్షలు ఫిబ్రవరిలో నిర్వహించగా ఫలితాలు ప్రస్తుతం విడుదల అయ్యాయి. ఈ పరీక్షల్లో 73 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ప్రవేశిక, ప్రథమ, మధ్యమ ఉత్తమ, విశారద పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానాచార్యులు నాగేశ్వరరావు తెలిపారు. ఎం.యోగితాబాయి, రేవతి, శ్రావణి, భార్గవి, అర్చనాంజలి, పల్లవి ప్రథమపరీక్షల్లో 93 శాతంతో జిల్లాలో సంయుక్తంగా ప్రథమస్థానంలో నిలిచారని చెప్పారు. అమృత ఉత్తమ పరీక్షల్లో జిల్లాలో రెండో స్థానంలో నిలిచారన్నారు. వీరిని శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు.


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

రోడ్డు సర్వే

రేణిగుంట: రోడ్డు ఆక్రమణలను తొలగించడానికి రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. రేణిగుంట మండలంలోని పాపానాయుడు పేట– రేణిగుంట ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఎల్లమండ్యం రెవెన్యూ లెక్క దాఖలు సర్వే నంబర్ 263/9 సి/1లో ఉన్న భూమికి సంబంధించి పత్రాలు ఉన్నాయని కొందరు వ్యక్తులు ప్రహరీ నిర్మాణానికి పూనుకున్నారు. దీనిపై స్థానికులు ఆర్ అండ్ అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఆర్ అండ్ బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మురుగయ్య నాయుడు గత నెలలో పనులను నిలుపుదల చేశారు. శుక్రవారం మండల రెవెన్యూ సర్వేయర్ కరుణాకర్ ఆర్ అండ్ బీ అధికారులు సర్వే చేశారు. మండల సర్వేయర్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అంతవరకు ఎటువంటి పనులు చేయవద్దని ఆదేశించామన్నారు.

జీవితాలు స్వర్ణం కాదు.. అంధకారం


స్వర్ణకారుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. రెడీమేడ్ ఆభరణాల దుకాణాదారులు మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకున్నారు. దీంతో ఇంతకాలం బంగారు పనులు చేసుకునే మన స్వర్ణకారులు ఇప్పుడు పనుల్లేక పస్తులు ఉంటున్నారు. వేరే పనులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఇంతకాలం అరకొరగా సాగిన వారి జీవితాల్లో నేడు పూర్తిగా అంధకారం నెలకొంది. ప్రభుత్వ సహకారం లేక స్వర్ణకారులు స్వస్థలాలు వీడి ఇతర ప్రాంతాలకు జీవనం కోసం వలస వెళ్తున్నారు.

- ఉపాధి లేక దుర్భర జీవనం గడుపుతున్న స్వర్ణకారులు
- పనుల్లేక పస్తులు
- ప్రత్యామ్నాయం చూపని పాలకులు
- సత్యవేడులో కనుమరుగవుతున్న స్వర్ణకారుల కుటుంబాలు


విరిగిన ఆభరణాలను అతికిస్తున్న స్వర్ణకారుడు

సత్యవేడు: రెడీమెడ్ ఫ్యాషన్ ఆభరణాలు రాకతో స్వర్ణకారుల ఉనికి ప్రశ్నార్థకమైంది. గత కొన్నేళ్లుగా పూర్తిస్థాయిలో పనులు దొరక్క పొట్ట చేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. మరికొందరు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక్కప్పుడు 100కు పైగా స్వర్ణకారుల వృత్తి చేపట్టిన కుటుంబాలు సత్యవేడులో ఉండేవి. ప్రస్తుతం రాను రాను 50లోపు ఉన్నారు. ప్రస్తుతం అయితే 25 లోపే కుటుంబాలు ఉన్నాయి. బంగారం ముద్దను కరిగించి కోరుకున్న రీతిలో ఆభరణాలుగా మలిచేవారు. మార్కెట్‌లోకి నేడు రెడీమేడ్ ఆభరణాలు రావడంతో కొంతవరకు పనులు తగ్గాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో వచ్చే పనులతో కాలం గడిపేస్తున్నారు. గతంలో పెళ్లిళ్ల సమయంలో బంగారం కొని ఆభరణాలు చేయించుకునేవారు. నేడు రెడీమేడ్ ఆభరణాలపై కొనుగోలుదారులు మొగ్గు చూపుతుండడంతో ఆర్డర్లు కాస్త కొండెక్కాయంటున్నారు. వెండి ఆభరణాలకు మెరుగులు వేసుకుంటూ, ఊడిపోయిన బంగారు నగలు అతికిస్తూ రోజులు గడుపుతున్నామని స్వర్ణకారులు చెబుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో తీరిక ఉండేది కాదు..



ఒకప్పుడు పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే తీరిక ఉండేది కాదు. వివిధ రకాల డిజైన్లతో నగలు తయారు చేయించుకునే వారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. మార్కెట్‌లోకి రెడీమేడ్ వస్తువులు వచ్చిపడ్డాయి. మాకు పనులు లేకుండా పోయాయి. ఒకరిద్దరు ఆభరణాలు చేయించుకునేందుకు వచ్చేవారు. ప్రస్తుతం వ్యైవెలరీ షాపులకు వెళ్తున్నారు.

– కోటీశ్వరన్ ఆచారి, తంబురాయగుడి వీధి, సత్యవేడు


రెడీమేడ్ దెబ్బ పడింది..



పెళ్లిళ్లకు రెడీమేడ్ ఆభరణాలు కొనుగోళ్లు ఎక్కువయ్యాయి. ఫలితంగా స్వర్ణకారులకు పని దొరకడం గగనంగా మారింది. కొన్నేళ్లుగా అరకొరగా పనులతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. నేటి ఆధునిక పోకడలు స్వర్ణకారులను మరింత దెబ్బ తీస్తున్నాయి.

– శ్రీనివాసులు ఆచారి, కోటమిట్ట, సత్యవేడు

చాల ఇబ్బందిగా ఉంది..



ప్రభుత్వ విధానాలతో మా పరిస్థితి అధ్వానంగా మారింది. బంగారు దుకాణాల నుంచి ఆర్డర్లు రావడం లేదు. పనులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇలాగే ఉంటే భవిష్యత్ కష్టమే. ప్రభుత్వం మాకు ఉపాధి అవకాశాలలో భాగంగా ఏదైనా ప్రత్యామ్నాయం చూపితే కుటుంబాలను పోషించుకుంటాం.

– పి.శేఖర్ ఆచారి, గాంధీ రోడ్డు, సత్యవేడు

ప్రభుత్వం పట్టించుకోలేదు..



స్వర్ణకారుల వృత్తిలో జీవిస్తున్న వారిని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వ గృహాలు మంజూరు కాలేదు. స్వర్ణకారులకు ఏ పథకాలు అందడం లేదు. సొంత ఇళ్లు ఉంది కాబట్టి సరిపోతుంది. లేకుంటే బాడుగలు కూడా ఇబ్బందే. స్వర్ణకారులకు సబ్సిడీలో రుణాలు అందిస్తే మేలు.

– శ్రీనాథ్ ఆచారి, గాంధీరోడ్డు, సత్యవేడు

ముక్కంటి సేవలో తెలంగాణ రాజ భవన్ కోఆర్డినేటర్


ఆలయం వద్ద తెలంగాణ రాష్ట్ర రాజభవన్ కోఆర్డినేటర్ ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం తెలంగాణ రాజభవన్ కోఆర్డినేటర్ ప్రద్యుమ్న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, నారాయణరావు, ఆంజనేయులు, శివశంకర్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయాధికారులు, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు గోపి, బాబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.